సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 7 । జనవరి । 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



గ్యారంటీలను అమలు చేయాలి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ డిమాండ్ చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
30.3 /10.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి.
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.
చలి తీవ్రత కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

బీసీ డిక్లరేషన్ అమలయ్యేనా?

రాష్ట్ర రాజకీయాలు 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్' చుట్టూ తిరుగుతున్నాయి. డిక్లరేషన్‌ను అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండగా.. ఇచ్చిన హామీని అమలు చేసి తీరుతామని అధికార పార్టీ పేర్కొంటోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా బీసీ డిక్లరేషన్ అమలు కాకపోవడంతో ప్రతిపక్షాలతోపాటు బీసీ సంఘాలు పోరుబాట పడుతున్నాయి.

- అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రకటన
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ
- వివిధ సామాజిక వర్గాలకు వరాలు..
- ఏడాది గడిచినా స్పష్టత కరువు
- ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు



కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 నవంబర్ 10న కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ సభ నిర్వహించింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు ఆ సభలో పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీల రిజర్వేషన్లు పెంచుతామని సభలో ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని, దీంతో పంచాయతీలు, మున్సిపాలిటీలలో కొత్తగా 23,973 మంది బీసీలకు రాజకీయ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా బీసీ డిక్లరేషన్ అమలు కాలేదు. దీంతో ఇదే అంశాన్ని ప్రతిపక్షాలు అస్త్రంగా మార్చుకుంటున్నాయి. ప్రతిపక్ష పార్టీలతో పాటు బీసీ సంఘాలు కూడా కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా బీసీ డిక్లరేషన్‌పై వివిధ పార్టీలు కార్యక్రమాలు చేపడుతుండడంతో రాష్ట్ర రాజకీయాల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అంశం హాట్ టాపిక్‌గా మారింది.

కుల గణన సర్వేపై చర్చ

రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ, కుల గణన చేపట్టిన విషయం తెలిసిందే. కులాలవారీ జనాభా వివరాలు సేకరించిన ప్రభుత్వం.. వాటి లెక్కలు తేలిన తర్వాత స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల అంశాన్ని పరిశీలించే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడిపడి ఉండడంతో అంతటా దీనిపైనే చర్చ నడుస్తోంది. కులాల లెక్కలు తేలిన తర్వాతే రిజర్వేషన్లు ఖరారు చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో కుల గణన లెక్కలకు సంబంధించిన నివేదిక గురించి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగిసి పదకొండు నెలలైంది. మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ముగిసి, ప్రత్యేకాధికారుల పాలన మొదలై ఆరు నెలలైంది. మున్సిపల్ పాలక వర్గాల పదవీ కాలం ఈనెల 26తో ముగియనుంది. ఈ నేపథ్యంలో కుల గణనకు సంబంధించిన నివేదిక కీలకం కానుంది. దాని ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేస్తారని భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా అదే ఆలోచనలు చేస్తుంది. దీనిపైనే ప్రతిపక్ష పార్టీలు కూడా ఫోకస్ చేస్తున్నాయి. దీంతో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అంశం హాట్ టాపిక్‌గా మారింది.

అమలుకు పెరుగుతున్న డిమాండ్

బీసీ సబ్‌ప్లాన్.. ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ.. మండలానికో బీసీ గురుకులం.. జిల్లాకో డిగ్రీ కళాశాల.. ఉన్నత విద్య కోసం రూ.10 లక్షల వరకు పూచికత్తు లేని వడ్డీలేని రుణాలు.. వృత్తిబజార్ పేరుతో ప్రతి మండలంలో 50 దుకాణాల షాపింగ్ కాంప్లెక్స్.. చేతివృత్తులవారికి 50 ఏళ్లకే వృద్ధాప్య పెన్షన్.. గొల్లకురుమలకు రెండో దశ గొర్రెల పంపిణీ.. మెగా పవర్‌లూంలు.. ఇలా బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా డిక్లరేషన్ అమలు కాకపోవడంతో ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాలన్నింటిలోనూ కామారెడ్డి డిక్లరేషన్ గురించిన చర్చే నడుస్తోంది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ గురించి ఇటీవల బీఆర్ఎస్, బీజేపీలతో పాటు బీసీ సంఘాలు కూడా ప్రశ్నిస్తున్నాయి. రౌండ్‌టేబుల్ సమావేశాలతో బీసీ డిక్లరేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ అమలు చేసేదాకా పోరాడుతామని ప్రకటనలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై ఉద్యమం మొదలుపెట్టారు. రాష్ట్ర రాజధానిలో బీసీ సంఘాలతో సమావేశాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ సంఘాల నాయకులు ఆ సమావేశానికి హాజరయ్యారు. బీజేపీ నాయకత్వం కూడా బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. బీసీ సంఘాలు కూడా పలు కార్యక్రమాలు చేపట్టాయి. కామారెడ్డిలోనూ వివిధ బీసీ సంఘాలు డిక్లరేషన్‌పై చర్చించాయి.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : నిజాంసాగర్ ప్రాజెక్టునుంచి విడుదల చేస్తున్న నీటిని పొదుపుగా వాడుకోవాలని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం బాన్సువాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి సాగునీరు వృథా కాకుండా చూడాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకుంటే మిగిలిన నిజాంసాగర్ నీటితో వచ్చే ఖరీఫ్‌లో నారుమడులు వేసుకోవచ్చన్నారు. సమావేశంలో బాన్సువాడ, బోధన్ సబ్ కలెక్టర్లు కిరణ్మయి, వికాస్ మహతో, నిజాంసాగర్ సీఈ శ్రీనివాస్, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ బలరాం, డీఈలు జగదీష్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఏఈలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి జూపల్లి రాక

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10 గంటలకు బాన్సువాడకు చేరుకుని, ఎక్సైజ్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. రూ. 52 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం కామారెడ్డికి చేరుకుని కామారెడ్డి మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. ఆయా కార్యక్రమాలలో ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, షబ్బీర్ అలీ తదితరులు పాల్గొంటారు.

న్యూస్‌రీల్

'విద్యుత్ లైన్లకు దూరంగా గాలిపటాలు ఎగురవేయాలి'

కామారెడ్డి అర్బన్: గాలి పటాలను మైదానాల్లో విద్యుత్ లైన్లకు దూరంగా ఎగురవేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. సంక్రాంతి సందర్భంగా పిల్లలు, పెద్దలు గాలిపటాలను ఎగురవేస్తుండడంతో విద్యుత్ లైన్లపై పడి తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ లైన్లపై గాలిపటాలు పడిపోయినప్పుడు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే తమ సిబ్బంది వచ్చి ప్రమాదం జరగకుండా వాటిని తొలగిస్తారని తెలిపారు. గాలిపటాలను ఎగురవేయడానికి చైనా మాంజా వినియోగించవద్దని సూచించారు.

11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కామారెడ్డి అర్బన్ : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలను ఈనెల 11వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు డీఈవో రాజు ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను ఈనెల 11, 12, 16, 17 తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ అభ్యర్థులు పరీక్షలకు కుట్టు మిషన్, టేబుల్, కత్తెర తదితర సామగ్రిని వెంట తీసుకుని రావాలని తెలిపారు.

సెపక్‌తక్రా రాష్ట్ర కోచ్‌గా నరేశ్



కామారెడ్డి అర్బన్: సెపక్‌తక్రా రాష్ట్ర కోచ్‌గా సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేశ్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ తెలిపారు.

ఇందిరమ్మ సర్వే పరిశీలన

బిచ్కుంద: మండల కేంద్రంలో సోమవారం హౌజింగ్ జిల్లా అధికారి విజయ్‌పాల్‌రెడ్డి, డీఈ గోపాల్ ఇందిరమ్మ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే సిబ్బంది వేగం పెంచి గడువులోగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ హన్మంతు, ఎంపీడీవో గోపాల్, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు'



కామారెడ్డి క్రైం: వివాదాల్లో తలదూర్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ కలిగిన వ్యక్తులకు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎలాంటి తగాదాలలో తలదూర్చవద్దని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో 5 నుంచి 9 తరగతులలో ప్రవేశాలకోసం టీజీసెట్ – 2025 నిర్వహించనున్నారు. ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జోనల్ –2 ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో 4 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణాలలో ఏడాదికి రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాలలో రూ. 1.50 లక్షలలోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు www.tswreis.ac.in లేదా http://tgcet. cgg.gov.in వెబ్‌సైట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చేనెల 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధనతో పాటు ఉచిత భోజనం, వసతి సదుపాయాలు ఉంటాయని పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చేనెల ఒకటో తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

భవానీపేట పల్లె దవాఖానాకు గుర్తింపు

మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని భవానీపేట పల్లె దవాఖానాకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్(ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికేషన్ లభించింది. ఈ విషయాన్ని మాచారెడ్డి మండల వైద్యాధికారి ఆదర్శ తెలిపారు. ఇటీవల ఎన్‌క్యూఏఎస్ బృందం ఆస్పత్రిని తనిఖీ చేసిందని పేర్కొన్నారు. పల్లె దవాఖానాలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకుగానూ ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు రావడానికి కృషి చేసిన సీహెచ్‌వోలు వేంకటేశ్వరరావు, శ్రీకాంత్, ఏఎన్ఎంలు రాజమణి, సుమలత, సిబ్బందిని అభినందించారు.



వివరాలు తెలుపుతున్న వైద్యాధికారులు

ఓటర్ల తుది జాబితా వెల్లడి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సవరించిన ఓటర్ల జాబితా విడుదలైంది. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మహిళా ఓటర్లే ఎక్కుగా ఉన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో పురుషుల కన్నా 10,199 మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఎల్లారెడ్డిలో 9,706 మంది, బాన్సువాడలో 9,568 మంది, జుక్కల్‌లో 4,240 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నట్లు తుది ఓటరు జాబితాలో స్పష్టం చేస్తోంది.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	సర్వీస్ ఓటర్లు	మొత్తం ఓటర్లు
జుక్కల్	255	1,01,076	1,05,316	10	2,06,402	147	2,06,549
బాన్సువాడ	259	94,577	1,04,145	16	1,98,738	201	1,98,939
ఎల్లారెడ్డి	274	1,08,075	1,17,781	02	2,25,858	287	2,26,145
కామారెడ్డి	267	1,23,919	1,34,118	20	2,58,057	166	2,58,223

వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలి

- ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: వచ్చే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామాల్లో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో ఆయన సమీక్షించారు. గత వేసవిలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని వచ్చే వేసవిలో తాగు నీటి సమస్యలు రాకుండా అద్దె బోర్లను పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలని, మురికి కాల్వల్లోని చెత్తను తొలగించాలని పేర్కొన్నారు. ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను వందశాతం సంరక్షించాలన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లు, వసతి గృహాలలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు క్షేత్ర పర్యటనలో అన్ని అంశాలను పర్యవేక్షించాలని సూచించారు.

ఇందిరమ్మ సర్వేను వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని, ఇప్పటికే సర్వే చేసిన వివరాల్లో రూఫ్ వివరాలు, గోడల వివరాలు పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులకు పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల వివరాలను బుధవారంలోగా సమర్పించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, జెడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సంచార చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి (ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన) పథకం కింద మంజూరైన సంచార చేపల విక్రయ వాహనాన్ని సోమవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధారి మండలంలోని స్వయం సహాయక సంఘ సభ్యురాలు తేజావత్ లతకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద రూ. 10 లక్షల విలువ చేసే సంచార చేపల అమ్మకం వాహనం మంజూరయ్యిందన్నారు. ఇందులో రూ. 4 లక్షలు సభ్యురాలు తన వాటాగా చెల్లించగా రూ. 6 లక్షలు సబ్సిడీ కింద మంజూరు చేశామని తెలిపారు. చేపలకోసం మత్స్య శాఖాధికారుల సహకారం పొందాలని, చేపల సరఫరా చేసే వారితో టై అప్ చేసుకోవాలని లతకు సూచించారు. వ్యాపారంలో రాణించి మరికొందరికి ఆదర్శంగా నిలుస్తానని తేజావాత్ లత పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా మత్స్య శాఖాధికారి శ్రీపతి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మురళీకృష్ణ, గాంధారి మండల సమాఖ్య అధ్యక్షురాలు పుష్పరాణి తదితరులు పాల్గొన్నారు.

'సంక్రాంతికి వస్తున్నాం' సందడి

- నగరంలో అట్టహాసంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్
- హాజరైన హీరో వెంకటేశ్, హీరోయిన్లు ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి
- తారలను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు



నిజామాబాద్‌లో సందడి చేస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర బృందం

నిజామాబాద్ రూరల్ : నగరంలో 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర యూనిట్ సందడి చేసింది. పాత కలెక్టరేట్ మైదానంలో సోమవారం సాయంత్రం సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను అట్టహాసంగా నిర్వహించారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ మూవీ సంక్రాంతి పండుగకు (ఈ నెల14న) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నగరంలో ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ తాను వెంకటేశ్‌తో తీసిన సినిమాలు అన్నీ హిట్ అయ్యాయన్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. తక్కువ రోజుల్లో సినిమాను తీసిన డైరెక్టర్ అనిల్ రావిపూడిని అభినందించారు. ఇందూరు గడ్డపై సంక్రాంతికి వస్తున్నాం సినిమా ట్రైలర్‌ను విడుదల చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ సినిమా హిట్ అవ్వాలని ఆకాంక్షించారు. హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరిలతో కలిసి వెంకటేశ్ డ్యాన్స్ చేసి అభిమానులను అలరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు నరాల సుధాకర్, సంతోష్, కొయ్యాడ శంకర్, నరాల రత్నాకర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు దహనం

కామారెడ్డి క్రైం: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం నమోదైన 71 కేసుల్లో రూ.7.98 కోట్ల విలువ చేసే నిషేధిత మత్తు పదార్థాలను ధ్వంసం చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి హన్మంతరావ్ తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి, అల్ప్రాజోలం, డైజోఫామ్, గంజాయి మొక్కలను సోమవారం జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలోని శ్రీమెడికేర్ సర్వీసెస్ కెమికల్ ఫ్యాక్టరీలో దహనం చేశామని పేర్కొన్నారు. 1,285.25 కిలోల ఎండు గంజాయి, 32.585 కిలోల అల్ప్రాజోలం, 71.845 కిలోల డైజోఫామ్, 114 గంజాయి మొక్కలను దహనం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్ కుమార్, మధుసూదన్‌రావ్, షాకీర్ హైమద్, సత్యనారాయణ, ఎస్సై విక్రమ్ కుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసం చేయడానికి సిద్ధంగా ఉన్న నిషేధిత మత్తు పదార్థాలు

క్లుప్తంగా

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



మాచారెడ్డి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తోట బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం పాల్వంచ మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ 29 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని కోరారు. ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ తుచ తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పాల్వంచ తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేశారు. పాల్వంచ మండల శాఖ అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు నరేష్, సత్యం యాదవ్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజుతో కలిసి సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం, కార్యదర్శి లక్ష్మి, ప్రతినిధులు నళినీదేవి, శ్రీనివాస్, నరేందర్, ప్రకాష్, గోప్య శ్రీనివాస్, ఎస్.నారాయణ, జి.బాబయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పచ్చ పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి



బీబీపేట: వరి నాట్లు వేసిన పొలాల్లో పచ్చ పురుగు ఉధృతిని గుర్తించి వాటిని నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఈవో రాఘవేంద్ర అన్నారు. సోమవారం ఇస్సానగర్‌లో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే కొన్ని చోట్ల వరి నాట్లు పడి 15 నుండి 20 రోజులు అవుతుందని అక్కడక్కడ ఆకు చుట్టూ పురుగు (పచ్చ పురుగు) ఉందని అలాగే ఇంకొన్ని రోజుల్లో మొగి పురుగు కూడా ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 96 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 96 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోరుతూ దూర ప్రాంతాల నుంచి ప్రజలు ప్రజావాణికి వస్తుంటారని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, జెడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అవకతవకలపై విచారణ చేపట్టాలి



కామారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయంలో పనిచేస్తున్న జిల్లా అధికారితోపాటు పలువురు సిబ్బంది ఉద్యోగ నియామకాలలో భారీగా అవకతవకలకు పాల్పడుతున్నారని బీవీఎం ప్రతినిధులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవకతవకలపై విచారణ జరపాలని, లేని పక్షంలో నిరుద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలతోపాటు నిరసనలు తెలుపుతామని బీవీఎం ప్రతినిధులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాస్ కాపీయింగ్ జరగకుండా చూడండి



బిచ్కుందలో ఈ నెల 18న జరిగే నవోదయ ప్రవేశ పరీక్షలో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని కలెక్టర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కొన్నేళ్ల నుంచి బిచ్కుంద మండల కేంద్రంలో నవోదయ ప్రవేశ పరీక్షలో, పరీక్ష కేంద్రంలో కొంత మంది ఇన్విజిలేటర్లు మాస్ కాపీయింగ్ చేయిస్తున్నారని.. దీని వల్ల కష్టపడి చదివిన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. కఠిన చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు టి.పండరిగౌడ్, రామ్ చంద్రాగౌడ్, పర్వయ్య, రూప్‌సింగ్, మల్లిఖార్జున్‌లు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

భగీరథ నీరు రావడం లేదు

పిట్లం(జుక్కల్): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. చిన్నకొడప్‌గల్‌లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారని తెలిపారు.

తాడ్వాయిలో ఫిర్యాదులు నిల్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహిమొద్దీన్ తెలిపారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఏవో నర్సింలు, సూపర్‌వైజర్ శివలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లేని భూమి పట్టాను రద్దు చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారం గ్రామానికి చెందిన బాబూరావు పేరిట ఉన్న పట్టాపాసు బుక్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన చౌదరి శ్రీనివాస్‌రావు సోమవారం నాగిరెడ్డిపేట తహసీల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 287/అ/1/1లో 1.2250 గుంటల భూమి ఉన్నట్లు బాబూరావు పేరిట పట్టా పాసుబుక్ ఉందని శ్రీనివాస్‌రావు తెలిపారు. వాస్తవానికి ఆ భూమి క్షేత్రస్థాయిలో లేదని ఆయన చెప్పారు. కాని బాబురావు తన పేరిట ఉన్న పట్టాపాసుబుక్‌పై నాగిరెడ్డిపేట యూనియన్ బ్యాంకులో రుణం పొందారన్నారు. తప్పుడు పత్రాలతో పొందిన పట్టా పాసు పుస్తకాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన అధికారులను కోరారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్‌రావు

పట్టాభూమి పాస్‌బుక్కులో నమోదు చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): యాభై ఏళ్లుగా సాగు చేస్తున్న వ్యవసాయ భూమిని పట్టాదారు పాస్‌బుక్కులో నమోదు చేయాలని లింగంపేట గ్రామానికి చెందిన మంగళి సాయన్న రైతు తరఫున కుమారుడు రవి సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ నరేందర్‌గౌడ్ తెలిపారు. మెంగారం ఊర చెరువు కింద సర్వే నంబర్ 54/ఇ4లో మూడు గుంటల పట్టా భూమి ఉంది. ఆ భూమి ధరణి పాసుబుక్కులో నమోదు కాలేదు. పాత పాసుపుస్తకాలు, అడంగల్ పహణీలను పరిశీలించిన తహసీల్దార్.. జిల్లా కలెక్టర్‌కు నివేదించి సమస్యను పరిష్కరించనున్నట్లు రైతుకు సూచించారు. ఎంపీడీవో నరేష్, ఏవో అనిల్‌కుమార్, ఏపీఎం శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ సతీష్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.



చెట్టు నీడే తరగతి గది



బట్టు తండా ప్రాథమిక పాఠశాలలో చెట్టు కింద బోధిస్తున్న ఉపాధ్యాయుడు

రామారెడ్డి : సర్కార్ బడుల పరిస్థితి మారడం లేదు. ప్రభుత్వాలు మారినా బడి పరిస్థితుల్లో మార్పు కనపడటంలేదు. రామారెడ్డి మండలం బట్టుతండా ప్రాథమిక పాఠశాలలో 61 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ఒకే తరగతి గది ఉండడంతో చెట్ల కింద బోధన చేయాల్సి వస్తోంది. గతంలో ఈ తండాను పంచాయతీగా మార్చడంతో బడి తరగతి గదిని గ్రామ పంచాయతీకి కేటాయించారు. మరో తరగతి గదిని నిర్మించాల్సింది పోయి ఉన్న తరగతి గదిని గ్రామ పంచాయతీకి ఇవ్వడంతో చెట్ల కిందే బోధన చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. అలాగే బడికి ప్రహరీ లేకపోవడంతో చాలా సార్లు పాములు లోపలికి వచ్చాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన టీఎన్‌జీవోలు



కామారెడ్డి అర్బన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం(టీఎన్‌జీవో) ప్రతినిధులు సోమవారం హైదరాబాద్ తరలివెళ్లారు. లలితా కళాతోరణంలో టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘ సమావేశం, డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలుండడంతో జిల్లా ప్రతినిధులు ప్రత్యేక బస్సులో వెళ్లారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి ఎం.నాగరాజు, ప్రతినిధులు చక్రధర్, దేవరాజు తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ఫరీదుపేటవాసి ప్రతిభ



మాచారెడ్డి: హైదరాబాద్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి క్రీడాకారుడు జీడిపల్లి సునీల్ రెడ్డి ప్రతిభ చాటినట్లు గ్రామస్తులు తెలిపారు. 5 కిలోమీటర్ల పరుగు పందెంతో పాటు 800 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చాటినట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామస్తులు సునీల్ రెడ్డిని అభినందించారు.

చేపల దాణా తయారీ యంత్రాల కోసం రుణం

లింగంపేట(ఎల్లారెడ్డి): బాయంపల్లి గ్రామానికి చెందిన కుంట యశోదకు చేపలు తినే దాణా తయారీ యంత్రాల కోసం రుణం మంజూరు చేయనున్నట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఆర్ముగం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బాయంపల్లి శివారులో ఏర్పాటు చేసిన ఫిష్ పాండ్, ఫిష్ దాణా తయారీ యంత్రాలను పరిశీలించి మాట్లాడారు. యశోద, దానా తయారీ యంత్రాల కోసం బ్యాంకులో రుణం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్, ఏపీఎం శ్రీనివాస్, సీసీ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



యంత్రాన్ని పరిశీలిస్తున్న బ్యాంకు మేనేజర్ ఆర్ముగం

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బీబీపేట: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక రేపు మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు మండల విద్యుత్ అధికారి విజయ్ భాస్కర్ తెలిపారు. బీబీపేట, దోమకొండ, భిక్కనూరు, రాజంపేట మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు హాజరు కావాలని సూచించారు. సమావేశానికి ఎన్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ నారాయణ, సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్‌లు హాజరవుతారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అటవీప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని సీతాయిపల్లి అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్న సోమవారం సమాచారం అందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సీతాయిపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బిలాల్‌వార్ రవి విధుల్లో భాగంగా అటవీ ప్రాంతంలో తిరుగుతుండగా భవానీపేట్ రోడ్డుకు సుమారు అర కిలోమీటరు దూరంలో బామన్‌కుంట ఎత్తుగడ్డ వద్ద చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ సంతోష్, ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని, సుమారు 20 నుంచి 25 రోజుల క్రితం గుర్తు అటవీప్రాంతంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించామని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆటో బోల్తా : డ్రైవర్ మృతి

- ఇద్దరు విద్యార్థులకు గాయాలు

బోధన్ టౌన్(బోధన్): ఆటో బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందగా, ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులను తీసుకుని వెళ్తున్న ఆటో బోధన్-పెగడాపల్లి రోడ్డులోని పెట్రోల్‌బంక్ వద్ద బోల్తాపడింది. ఈ ఘటనలో పెగడాపల్లికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ గౌస్(38) అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. నలుగురు విద్యార్థులు రెంజల్ మండలం సాటాపూర్, నీలా గ్రామాలకు చెందిన వారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ వెంకటనారాయణ ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గాయాలపాలైన ఇద్దరు విద్యార్థులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలైన మరో ఇద్దరిని వారి ఇళ్లకు తరలించారు.

దాడి ఘటనలో కేసు నమోదు

సిరికొండ: మండలంలోని పందిమడుగు తండాకు చెందిన బానావత్ మంజులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంజులకు వివాహ సమయంలో ఎకరం భూమి ఇస్తామని ఆమె అన్న బీమా, మామ ఫరంగి నాయక్ చెప్పారు. గత నెల 31న భూమి విషయం అడిగేందుకు బీమా, ఫరంగి వద్దకు మంజుల తన భర్త తిరుపతితో కలిసి వెళ్లింది. దీంతో వారిని దూషిస్తూ బీమా, ఫరంగి చెప్పుతో కొట్టారు. చంపేస్తామని బెదిరించారు. మంజుల ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సులేమాన్‌నగర్‌కు చెందిన ముగ్గురిపై..

రుద్రూర్: మండలంలోని సులేమాన్‌నగర్‌కు చెందిన హబీబ్ అనే వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మురికి కాలువ సమస్యపై జరుగుతున్న గొడవను మాన్పించడానికి వచ్చిన హబీబ్‌పై గ్రామానికి చెందిన ముగ్గురు దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

నిజామాబాద్ రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఓ వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ తెలిపారు. ఆదివారం రాత్రి బైపాస్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వేల్పూర్‌కు చెందిన వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు. సదరు వ్యక్తిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పరీక్ష సరిగా రాయలేదని చితకబాదిన టీచర్

- రెండో తరగతి విద్యార్థిపై ఉపాధ్యాయురాలి ప్రతాపం
- కేసు నమోదు చేసిన పోలీసులు
- కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలో ఘటన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో ఉన్న కేరళ స్కూల్‌లో ఓ విద్యార్థిని రెండురోజుల క్రితం ఉపాధ్యాయురాలు బెత్తంతో చితకబాదింది. సదరు టీచర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగిరెడ్డిపేటకు చెందిన ఓ వ్యక్తి కుమారుడు గోపాల్‌పేటలోని కేరళ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. బాబు ఫీజు చెల్లించాలని స్కూల్ యాజమాన్యం అతడి తండ్రికి ఫోన్ చేశారు. దీంతో తండ్రి స్కూల్ ఫీజు చెల్లించేందుకు తన కొడుకును తీసుకొని శనివారం స్కూల్‌కు వెళ్లాడు. ఆ సమయంలో ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోవడంతో ఆమెకు ఫోన్ చేసిన తండ్రి తన కొడుకు ఫీజును చెల్లిస్తానని చెప్పగా.. తాను ఇప్పుడు స్కూల్‌లో లేనని, తర్వాత వచ్చి ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ చెప్పడంతో అతడు తన కొడుకును స్కూల్‌లో వదిలి ఇంటికి వెళ్లిపోయాడు. కాగా అదేరోజు నిర్వహించిన పరీక్ష సరిగా రాయలేదని కారణంతో ఉపాధ్యాయురాలు బాబును చితకబాదడంతో చేతులు, కాళ్లపై వాతలు వచ్చాయి. స్కూల్ నుంచి ఇంటికి వెళ్లిన తమ కుమారుడి ఒంటిపై వాతలను గమనించిన తల్లిదండ్రులు ఆదివారం అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బాబును చితకబాదిన ఉపాధ్యాయురాలితోపాటు స్కూల్ యాజమాన్యంపై తండ్రి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. బాబును చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



విద్యార్థి చేయిపై ఏర్పడిన వాతలు

కుటుంబ సభ్యులకు పిల్లల అప్పగింత

మాక్లూర్: ఇంటి నుంచి తప్పిపోయి వచ్చిన ఇద్దరు పిల్లలను మాక్లూర్ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దాస్‌నగర్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఉదయం ఇద్దరు పిల్లలు ఏడుస్తూ రోడ్డుపై తిరుగుతున్నారని సమాచారం అందడంతో ఎస్సై రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ ఎంఏ అజ్మత్ వెళ్లి వారిని స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లికి చెందిన రావుల మనోజ్ (7), రావుల మధుగా (5) వారిని గుర్తించారు. వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేయడంతో పిల్లల కుటుంబ సభ్యులు హుటాహుటిన మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పిల్లలను వారివెంట తీసుకెళ్లారు. తప్పిపోయి వచ్చిన ఇద్దరు పిల్లల తల్లి సారక్క జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తుండగా, తండ్రి ఎర్రన్న నెలక్రితం మృతి చెందినట్లు తెలిసింది. పిల్లలిద్దరూ ప్రస్తుతం వారి నానమ్మ సంరక్షణలో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు.



చిన్నారులను నానమ్మకు అప్పగిస్తున్న పోలీసులు

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

- చెలరేగిన మంటలు.. తప్పిన పెను ప్రమాదం

కామారెడ్డి క్రైం: విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటన కామారెడ్డి పట్టణంలోని రుక్మిణి కుంట ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. పట్టణంలోని రుక్మిణి కుంటలో ఈ ఘటన జరిగింది. ఇద్దరు వ్యక్తులు కారులో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకోగా, పక్కనే పార్క్ చేసిన బైక్ ధ్వంసమైంది. కారు ఢీకొనడంతో స్తంభంపై మంటలు చెలరేగాయి. అటువైపుగా ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు



నిజాంసాగర్(జుక్కల్): అదృశ్యమైన వ్యక్తి నిజాంసాగర్ ప్రధాన కాలువలో మృతదేహమై తేలాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన గోగికర్ కపిల్(32) గతేడాది డిసెంబర్ 18వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. సెల్‌ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అదృశ్యం కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో కుళ్లినస్థితిలో కపిల్ మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు ఉన్నారు.

పరిస్థితి విషమించి మృతి

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దాస్‌నగర్‌కు చెందిన సంపంగి సాయిలు(42), మక్క ప్రవీణ్ కూలీ పని నిమిత్తం నందిపేటకు వెళ్లి ఆదివారం రాత్రి తిరిగి వస్తుండగా గాంధీనగర్ వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయిలు తలకు బలమైన గాయాలుకాగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య సంపంగి లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పొతంగల్ తహసీల్దార్ మల్లయ్య సోమవారం తెలిపారు. పొతంగల్ మండలం సుంకిని గ్రామ పరిధిలో నుంచి ఆదివారం ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందడంతో ప్రత్యేక బృందం అధికారులు ట్రాక్టర్లను పట్టుకున్నారన్నారు. ట్రాక్టర్లను రవాణాశాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

10న రేషన్ బియ్యం వేలం

వేల్పూర్: వివిధ చోట్ల సీజ్ చేసిన 1470.20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఈనెల 10వ తేదీన తహసీల్ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు తహసీల్దార్ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆసక్తి ఉన్న వ్యక్తులు నిర్దేశిత రుసుమును డీడీ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

రెండు ఆలయాల్లో చోరీ

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఉన్న రెండు ఆలయాల్లో దుండగులు సోమవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లోని హుండీలను ధ్వంసం చేశారు. అమ్మవార్ల ముక్కు పుడకలు, వెండి కళ్ల అచ్చులను ఎత్తుకెళ్లారు. ఆలయాల కమిటీల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.